APTEL/26/A4269

# అనంత సూర్య

www.ananthasurya.com తెలుగువార్త

ప్రచురణ : అనంతపురం / శ్రీ సత్యసాయి ఎడిటర్ : సి హరికృష్ణ బుధవారం 22, జూలై 2026 సంపుటి: 01 సంచిక :55 పేజీలు : 04 వెల: 2-00/-



## మూడు వైద్య సాంకేతికతల బదిలీ

- క్యాన్సర్, అంటువ్యాధుల చికిత్సకు కొత్త ముందడుగు
- స్వదేశీ పరిశోధనలకు ఐసీఎంఆర్ ప్రోత్సాహం
- అందుబాటు వైద్య సేవలే ప్రభుత్వ లక్ష్యం

న్యూఢిల్లీ, జూలై 21 : భారత వైద్య పరిశోధనా మండలి (ఐసీఎంఆర్) దేశీయంగా అభివృద్ధి చేసిన మూడు కీలక జీవవైద్య సాంకేతికతలను తదుపరి అభివృద్ధి, వాణిజ్య వినియోగం కోసం సంబంధిత సంస్థలకు బదిలీ చేసింది. క్యాన్సర్, అంటువ్యాధుల నివారణ, చికిత్స రంగాల్లో స్వదేశీ పరిష్కారాలను వేగంగా ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడమే ఈ చర్య ప్రధాన ఉద్దేశమని అధికారులు తెలిపారు. బదిలీ చేసిన సాంకేతికతల్లో హెచ్‌పీవీ వైరస్ నిరోధానికి ఉపయోగపడే ఎస్‌హెటా--2 ప్రతిరక్షక అభ్యర్థి, అలాగే పేగు సంబంధిత అంటువ్యాధులను నివారించే రెండు స్వదేశీ టీకా సాంకేతికతలు ఉన్నాయి. వీటిని తదుపరి దశల పరిశోధనలు, ఉత్పత్తి అభివృద్ధి, క్లినికల్ వినియోగానికి అనువుగా తీర్చిదిద్దేందుకు సంబంధిత సంస్థలు చర్యలు చేపట్టనున్నాయి.ప్రభుత్వ నిధులతో అభివృద్ధి చేసిన పరిశోధన ఫలితాలు ప్రయోగశాలలకే పరిమితం కాకుండా ప్రజలకు ఉపయోగపడే వైద్య ఉత్పత్తులుగా మారేందుకు ఈ సాంకేతిక బదిలీ దోహదపడుతుందని ఐసీఎంఆర్ పేర్కొంది. దేశంలో నాణ్యమైన, తక్కువ వ్యయంతో వైద్య సేవలను అందించడంలో ఇది కీలక ముందడుగుగా నిలుస్తుందని వెల్లడించింది. ఆరోగ్య పరిశోధన శాఖ కార్యదర్శి, ఐసీఎంఆర్ డైరెక్టర్ జనరల్ రాజీవ్ బహల్ మాట్లాడుతూ, వైద్య ఆవిష్కరణల పేటెంట్ మిత్ర కార్యక్రమం దేశాన్ని ఆరోగ్య రంగంలో స్వావలంబన దిశగా వేగంగా నడిపిస్తోందన్నారు.

## యూఏఈతో ఏపీ భాగస్వామ్యం

- ముఖ్యమంత్రి చంద్రబాబును కలిసిన అబ్దుల్లా అల్ మర్రీ
- ఆహార ఉత్పత్తుల విలువ గొలుసుకు ఒప్పందం
- అంతర్జాతీయ మార్కెట్లపై ప్రత్యేక దృష్టి



అమరావతి, జూలై 21: ఆంధ్రప్రదేశ్‌లో ఆహార ఉత్పత్తుల రంగ అభివృద్ధి, అంతర్జాతీయ పెట్టుబడుల ఆకర్షణ లక్ష్యంగా యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌తో రాష్ట్ర ప్రభుత్వం కీలక భాగస్వామ్యానికి శ్రీకారం చుట్టింది. యూఏఈ ఆర్థిక, పర్యాటక శాఖ మంత్రి అబ్దుల్లా బిన్ తౌక్ అల్ మర్రీ మంగళవారం సచివాలయంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుతో భేటీ అయ్యారు. రాష్ట్రంలో ఆహార ఉత్పత్తుల విలువ గొలుసు ఏర్పాటు, ఎగుమతుల విస్తరణపై ఇరు వర్గాలు విస్తృతంగా చర్చించాయి. ఈ ఏడాది దావోస్ పర్యటన సందర్భంగా ఆంధ్రప్రదేశ్‌లో ఆహార ఉత్పత్తుల సముదాయం ఏర్పాటు చేయడానికి యూఏఈ సంసిద్ధత వ్యక్తం చేసిన నేపథ్యంలో మంగళవారం జరిగిన సమావేశానికి ప్రాధాన్యం ఏర్పడింది. యూఏఈ ప్రతినిధుల బృందంతో జరిగిన సుదీర్ఘ చర్చల అనంతరం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ మధ్య భాగస్వామ్య ఒప్పందం కుదిరింది.ఈ ఒప్పందం ద్వారా మామిడి, అరటి, కోకోతో పాటు రాష్ట్రంలో ఉత్పత్తి అయ్యే వివిధ ఉద్యాన పంటలకు అంతర్జాతీయ మార్కెట్లలో మెరుగైన అవకాశాలు కల్పించేలా విలువ గొలుసు వ్యవస్థను అభివృద్ధి చేయాలని నిర్ణయించారు. ఉత్పత్తుల నాణ్యత, నిల్వ, శుద్ధి, ప్యాకేజింగ్, రవాణా, ఎగుమతుల వరకు సమగ్ర వ్యవస్థను ఏర్పాటు చేసి రైతులకు అధిక ఆదాయం అందేలా చర్యలు చేపట్టనున్నారు. ఆహార శుద్ధి పరిశ్రమల అభివృద్ధి, పెట్టుబడుల ప్రోత్సాహం, ఎగుమతుల పెంపు ద్వారా రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి ఊతమివ్వడమే ఈ భాగస్వామ్య ఒప్పందం ప్రధాన ఉద్దేశమని అధికారులు తెలిపారు. ఉద్యాన పంటల ఉత్పత్తులకు ప్రపంచ మార్కెట్లలో డిమాండ్ పెంచడంతో పాటు రైతులకు స్థిరమైన మార్కెట్ అవకాశాలు కల్పించేందుకు ఈ ప్రణాళిక దోహదపడుతుందని పేర్కొన్నారు.



## భవిష్యత్ పోలీసింగ్‌పై సమీక్ష

- పోలీస్ రిట్రీట్‌లో పాల్గొన్న మంత్రి అనిత
- ఆధునిక నేరాల నియంత్రణపై దిశానిర్దేశం
- సైబర్ భద్రత, మహిళల రక్షణపై ప్రత్యేక చర్చ

విజయవాడ, జూలై 21 : భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా ఆంధ్రప్రదేశ్ పోలీసు వ్యవస్థను మరింత సమర్థవంతంగా తీర్చిదిద్దే లక్ష్యంతో నిర్వహించిన 'ఫ్యూచర్-రెడీ ఏపీ పోలీస్ రిట్రీట్--2026' కార్యక్రమంలో హోంశాఖ మంత్రి అనిత పాల్గొన్నారు. విజయవాడలోని అంబేద్కర్ కన్వెన్షన్ హాల్‌లో నిర్వహించిన ఈ సదస్సులో పోలీసింగ్‌లో తీసుకురావాల్సిన సంస్కరణలు, సాంకేతికత వినియోగం, కొత్త తరహా నేరాల నియంత్రణపై సమగ్రంగా చర్చించారు. ఈ సందర్భంగా మంత్రి అనిత మాట్లాడుతూ మారుతున్న కాలానికి అనుగుణంగా నేరాల స్వరూపం కూడా వేగంగా మారుతోందని, అలాంటి పరిస్థితుల్లో పోలీసు వ్యవస్థ కూడా సాంకేతికంగా మరింత బలోపేతం కావాల్సిన అవసరం ఉందన్నారు

## హస్తకళలకు ప్రజల ఆదరణ



- విజయవాడ, తిరుపతి ప్రదర్శనలకు విశేష స్పందన
- మూడు రోజుల్లో రూ.20 లక్షల విక్రయాలు
- మరిన్ని పట్టణాలకు విస్తరించనున్న లేపాక్షి

అమరావతి, జూలై 20: దేశంలో తొలి గ్రీన్ హైడ్రోజన్ ఆధారిత రైలు ప్రారంభం కావడం భారత్ సుస్థిర అభివృద్ధి దిశగా సాధించిన చారిత్రాత్మక విజయమని ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, పర్యావరణ, అటవీ, విజ్ఞాన సాంకేతిక శాఖ మంత్రి పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశం పర్యావరణహిత రవాణా వ్యవస్థ వైపు మరో కీలక అడుగు వేసిందని ఆయన తెలిపారు. గ్రీన్ హైడ్రోజన్‌తో నడిచే ఈ రైలు ప్రపంచంలోనే అత్యంత శక్తివంతమైన, అత్యంత పొడవైన బ్రాడ్‌గేజ్ హైడ్రోజన్ రైలు సముదాయాల్లో ఒకటిగా నిలిచిందని పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. వినియోగ సమయంలో కేవలం నీటి ఆవిరి మాత్రమే విడుదల చేసే ఈ సాంకేతికత పర్యావరణ పరిరక్షణతో పాటు ఆర్థికాభివృద్ధికి కూడా దోహదపడుతుందని అన్నారు.గత పదేళ్లలో భారతీయ రైల్వేలు విద్యుదీకరణ, వందే భారత్ రైళ్లు, ఆధునిక రైల్వే స్టేషన్లు, ప్రత్యేక సరకు రవాణా మార్గాలు, స్వదేశీ భద్రతా వ్యవస్థలు వంటి అనేక రంగాల్లో విశేష పురోగతి సాధించాయని తెలిపారు. ఇప్పుడు హైడ్రోజన్ ఆధారిత రైలు ప్రారంభంతో సుస్థిర రైల్వే రవాణాలో భారత్ ప్రపంచానికి ఆదర్శంగా నిలుస్తోందని పేర్కొన్నారు. ఇది కేవలం రవాణా రంగంలో సాధించిన విజయం మాత్రమే కాకుండా పర్యావరణ పరిరక్షణ, సాంకేతిక ఆవిష్కరణలు కలిసికట్టుగా ముందుకు సాగగలవని నిరూపించిన ఘట్టమని పవన్ కల్యాణ్ అన్నారు. స్వచ్ఛమైన ఇంధన వినియోగం ద్వారా భవిష్యత్ తరాలకు మెరుగైన పర్యావరణాన్ని అందించే దిశగా ఇది కీలక అడుగని చెప్పారు.ఆంధ్రప్రదేశ్‌లో కూడా స్వచ్ఛ ఇంధనం, సహజ వనరుల పరిరక్షణ, సుస్థిర అభివృద్ధికి దోహదపడే సాంకేతికతలకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని పవన్ కల్యాణ్ తెలిపారు. భవిష్యత్ తరాలకు పర్యావరణహిత అభివృద్ధిని అందించేందుకు అన్ని విధాలా కృషి కొనసాగిస్తామని పేర్కొన్నారు. ఈ చారిత్రాత్మక విజయాన్ని సాధించిన ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, రైల్వే శాఖ, శాస్త్రవేత్తలు, ఇంజినీర్లు, భారతీయ రైల్వేలు, పరిశోధన సంస్థలు, ఈ ప్రాజెక్టు అమలులో భాగమైన ప్రతి ఒక్కరికీ పవన్ కల్యాణ్ అభినందనలు తెలిపారు. గ్రీన్ టెక్నాలజీ ద్వారా స్వచ్ఛమైన పర్యావరణం, బలమైన భారత్ నిర్మాణం సాధ్యమవుతుందని ఆయన పేర్కొన్నారు.



## 260 మంది విద్యార్థులకు సత్కారం

- షైనింగ్ స్టార్ అవార్డుల్లో పాల్గొన్న మంత్రి నారాయణ
- ప్రతిభకు నగదు బహుమతులు, పతకాలు ప్రదానం
- కష్టపడి చదివితేనే విజయమని విద్యార్థులకు సూచన

నెల్లూరు, జూలై 21: నెల్లూరులో నిర్వహించిన షైనింగ్ స్టార్ అవార్డ్స్--2026 కార్యక్రమంలో రాష్ట్ర మంత్రి పొంగూరు నారాయణ పాల్గొని వివిధ విద్యా విభాగాల్లో ప్రతిభ కనబరిచిన 260 మంది విద్యార్థులను సత్కరించారు. విద్యార్థులకు అవార్డులు, పతకాలు, నగదు బహుమతులు అందజేసి అభినందించారు. ఈ విజయానికి తోడ్పడిన తల్లిదండ్రులు, ఉపాధ్యాయులను కూడా ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా మంత్రి నారాయణ మాట్లాడుతూ ఏ రంగంలో-నైనా విజయం సాధించాలంటే కష్టపడి పనిచేయడం, క్రమశిక్షణ, పట్టుదల అత్యంత ముఖ్యమని విద్యార్థులకు సూచించారు. లక్ష్యాన్ని నిర్దేశించుకుని నిరంతర శ్రమతో ముందుకు సాగితే ఉన్నత శిఖరాలను చేరుకోవడం సాధ్యమవుతుందని చెప్పారు.రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగంలో అమలు చేస్తున్న సంస్కరణలు, విద్యార్థులకు కల్పిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని మంత్రి కోరారు. నాణ్యమైన విద్యతో పాటు నైపుణ్యాభివృద్ధిపై దృష్టి సారిస్తే భవిష్యత్తులో దేశ అభివృద్ధికి తోడ్పడే ఉత్తమ పౌరులుగా ఎదగవచ్చని పేర్కొన్నారు. ప్రతిభను ప్రోత్సహించడం ద్వారా మరింత మంది విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించేందుకు ప్రేరణ లభిస్తుందని మంత్రి తెలిపారు. విద్యార్థుల విజయాల వెనుక తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమని పేర్కొంటూ వారి సేవలను కొనియాడారు.కష్టానికి ప్రత్యామ్నాయం లేదని, సమయపాలన, క్రమశిక్షణ, నిరంతర సాధనతోనే విజయాలు సాధ్యమవుతాయని మంత్రి విద్యార్థులకు సూచించారు. ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని వాటి సాధన కోసం అంకితభావంతో కృషి చేయాలని పిలుపునిచ్చారు షైనింగ్ స్టార్ అవార్డ్స్--2026 కార్యక్రమంలో ప్రతిభ కనబరిచిన 260 మంది విద్యార్థులకు అవార్డులు, పతకాలు, నగదు బహుమతులు ప్రదానం చేశారు.

అనంత సూర్య తెలుగువార్త

బుధవారం 22 జూలై 2026

# చెన్నేపేటలో అమెరికా సత్యసాయి భక్తుల గ్రామసేవ







**• 150 కుటుంబాలకు అమృత కలశాలు, విద్యార్థులకు స్టేషనరీ కిట్లు పంపిణీ**

పుట్టపర్తి, జూలై 21 అనంత సూర్య:భగవాన్ శ్రీ సత్యసాయిబాబా బోధించిన "ప్రేమించండి.. సేవ చేయండి" సందేశాన్ని ఆచరణలో చూపిస్తూ, శ్రీ సత్యసాయి గ్లోబల్ కౌన్సిల్ (అమెరికా) జోన్-1కు చెందిన భక్తులు మంగళవారం శ్రీ సత్యసాయి జిల్లా చెన్నేకొత్తపల్లి మండలంలోని చెన్నేపేట గ్రామంలో గ్రామసేవ కార్యక్రమం నిర్వహించారు. శ్రీ సత్యసాయి గ్లోబల్ కౌన్సిల్ జాతీయ అధ్యక్షుడు ప్రొఫెసర్ బాలు కరణం నాయకత్వంలో వచ్చిన భక్తులు గ్రామంలోని 150 కుటుంబాలకు అమృత కలశాలు, విద్యార్థులకు స్టేషనరీ కిట్లు పంపిణీ చేశారు. గ్రామస్థులు వారికి సంప్రదాయబద్ధంగా ఘన స్వాగతం పలికారు.కార్యక్రమంలో పాల్గొన్న శ్రీ సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్.జె. రత్నాకర్ మాట్లాడుతూ, భగవాన్ సందేశ-మైన "భజన ఉంటే విభజన ఉండదు" అనే సూత్రాన్ని ప్రతి గ్రామానికి చేర్చేలా సేవా కార్యక్రమాలు కొనసాగుతున్నాయని తెలిపారు. రాష్ట్రంలో రాగి జావ పంపిణీ, మానవతా విలువల విద్య వంటి కార్యక్రమాల ద్వారా సమాజాభివృద్ధికి ట్రస్ట్ కృషి చేస్తోందని పేర్కొన్నారు.కార్యక్రమంలో శ్రీ సత్యసాయి సేవా సంస్థల జాతీయ, రాష్ట్ర, జిల్లా ప్రతినిధులు, అమెరికా భక్తులు, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# మహిళలు, చిన్నారుల భద్రతపై అవగాహన కార్యక్రమం

**పోక్సో చట్టం, సైబర్ భద్రతపై విద్యార్థినులకు సూచనలు**

రొళ్ల, జూలై 21అనంత సూర్య: జిల్లా ఎస్పీ ఎస్. సతీష్ కుమార్, ఐపీఎస్ ఆదేశాల మేరకు రొళ్ల పోలీస్ స్టేషన్ పరిధిలోని కేజీబీవీ పాఠశాలలో మంగళవారం ఎస్సై నరసింహులు ఆధ్వర్యంలో మహిళలు, చిన్నారుల భద్రతపై ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా విద్యార్థినులకు పోక్సో చట్టం, బాల్య వివాహాల నివారణ, సైబర్ నేరాల నుంచి రక్షణ, మహిళలు, చిన్నారులపై జరిగే నేరాలను నివారించే మార్గాలపై అవగాహన కల్పించారు. అత్యవసర పరిస్థితుల్లో వెంటనే 100, 112 నంబర్లకు ఫోన్ చేసి పోలీసుల సహాయం పొందాలని సూచించారు.సామాజిక మాధ్యమాలను బాధ్యతా యుతంగా వినియోగించాలని, అపరిచితులను నమ్మి వ్యక్తిగత వివరాలు, ఓటీపీలు పంచుకోవద్దని, సైబర్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని విద్యార్థినులకు సూచించారు.అలాగే విద్యపై దృష్టి సారించి ఉన్నత లక్ష్యాలు సాధించాలని, తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సూచనలు పాటిస్తూ మంచి పౌరులుగా ఎదగాలని ఎస్సై నరసింహులు ప్రోత్సహించారు.కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థినులు పాల్గొన్నారు.



# నామాలలో రూ.50 లక్షల సీసీ రోడ్ల ప్రారంభం





**ఇచ్చిన హామీలన్నీ నెరవేరుస్తున్నాం: ఎమ్మెల్యే పరిటాల సునీత**

అనంతపురం, జూలై 21 అనంత సూర్య:ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నామని, ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలు గుర్తించాలని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత అన్నారు.మంగళవారం చెన్నేకొత్తపల్లి మండలం ప్యాదిండి పంచాయతీ పరిధిలోని నామాల గ్రామంలో రూ.50 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్లను ఆమె ప్రారంభించారు.ఈ సందర్భంగా గ్రామస్థులు, టీడీపీ నాయకులు ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు.అనంతరం నిర్వహించిన సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ, రాప్తాడు నియోజకవర్గంలో గత రెండేళ్లలో ఎన్ఆర్ఈజీఎస్, ఎంపీ, జిల్లా పరిషత్ నిధులతో సుమారు రూ.100 కోట్ల విలువైన సీసీ, బీటీ రోడ్లు నిర్మించామని తెలిపారు.చెన్నేకొత్తపల్లి మండలంలో రూ.25 కోట్లతో, ప్యాదిండి పంచాయతీలో రూ.1.50 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టినట్లు చెప్పారు.గ్రామస్థులు అంగన్‌వాడీ భవనం, సచివాలయం, రహదారుల నిర్మాణంపై చేసిన విజ్ఞప్తులను పరిశీలించి ప్రాధాన్యక్రమంలో పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు.ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను సమర్థంగా అమలు చేస్తోందని పేర్కొన్నారు.'తల్లికి వందనం' పథకం కింద ప్రతి అర్హ విద్యార్థికి రూ.15 వేల ఆర్థిక సాయం అందిస్తున్నామని, ఈ ఏడాది నుంచి అంగన్‌వాడీ సిబ్బంది పిల్లలకు కూడా ఈ పథకం వర్తిస్తోందని తెలిపారు.ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలను ప్రజలు ఆదరించి, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో అభివృద్ధికి మద్దతు ఇవ్వాలని ఎమ్మెల్యే సునీత కోరారు.

# వలస బొగ్గుల కూలీల పిల్లలకు పౌష్టికాహారం అందించేందుకు గుర్తింపు ప్రక్రియ



కొత్తచెరువు, జూలై 21 అనంత సూర్య:కొత్తచెరువు మండలంలో మహారాష్ట్ర నుంచి వలస వచ్చిన బొగ్గుల కూలీల కుటుంబాలను గుర్తించి, వారి చిన్నారులకు ప్రభుత్వం అందించే పౌష్టికాహార సేవలు అందించేందుకు ప్రత్యేక గుర్తింపు కార్యక్రమం చేపట్టారు.ఈ కార్యక్రమంలో పుట్టపర్తి సీడీపీవో జయంతి, టీవీఎంసీ సభ్యుడు రామాంజనేయులు మండలంలోని పలు ప్రాంతాల్లో పర్యటించి వలస కూలీల కుటుంబాలను గుర్తించారు. పిల్లలకు అంగన్‌వాడి ద్వారా పౌష్టికాహారం, ఆరోగ్య సేవలు అందేలా అవసరమైన వివరాలను సేకరించారు.వలస కూలీల పిల్లలు కూడా ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు పొందేలా అధికారులు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.గుర్తింపు ప్రక్రియ పూర్తయ్యాక అర్హులైన చిన్నారులకు పౌష్టికాహారం అందించనున్నట్లు వెల్లడించారు.

# కదిరిలో జూలై 24న మెగా జాబ్ మేళా




**• 11 ప్రముఖ కంపెనీలతో ఇంటర్వ్యూలు..**

**• నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలి: కలెక్టర్ శ్యామ్ ప్రసాద్**

పుట్టపర్తి, జూలై 21 అనంత సూర్య:ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో జూలై 24న కదిరి పట్టణంలోని ఎస్‌టీఎస్ఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ ఏ. శ్యామ్ ప్రసాద్ తెలిపారు.మంగళవారం జిల్లా జాయింట్ కలెక్టర్‌తో కలిసి జాబ్ మేళా పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు.ఈ జాబ్ మేళాలో అపోలో ఫార్మసీ, భారత్ సీరమ్స్, ఏథర్ ఎనర్జీ, థైసెన్‌క్రుప్, యునో మిండా, స్లింగో, ఏఐఎల్ డిక్సన్, టాటా ఎలక్ట్రానిక్స్, ఫాక్స్‌కాన్, హ్యుందాయ్ మొబిస్, ఎల్ఎంఎస్ తదితర 11 ప్రముఖ కంపెనీలు పాల్గొని అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించనున్నాయి.పదో తరగతి, ఇంటర్, ఐటీఐ, డిప్లొమా, డిగ్రీ, బీటెక్, పీజీ అర్హతలు కలిగిన 18 నుంచి 35 సంవత్సరాల మధ్య వయస్సు గల నిరుద్యోగ యువతీ, యువకులు హాజరు కావచ్చని తెలిపారు. ఎంపికైన అభ్యర్థులకు నెలకు రూ.15 వేల నుంచి రూ.25 వేల వరకు వేతనం లభించే అవకాశముందని చెప్పారు.అభ్యర్థులు విద్యార్హత ధ్రువపత్రాల జిరాక్స్ ప్రతులు, ఆధార్ కార్డు వెంట తీసుకురావాలని సూచించారు.మరిన్ని వివరాలకు 9390176421, 9440074407 నంబర్లను సంప్రదించాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి హరికృష్ణ, ఎస్‌టీఎస్ఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ సలీం భాషా తదితరులు పాల్గొన్నారు.

# 24 గంటల్లోనే సీఎంఆర్ఎఫ్ సహాయం మంజూరు





ధర్మవరం, జూలై 21 అనంత సూర్య:ధర్మవరం పట్టణం గీతానగర్‌కు చెందిన కాటా శ్రీరాములు బ్రెయిన్ స్ట్రోక్‌తో చికిత్స పొందుతూ ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో, రాష్ట్ర వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మరియు వైద్య విద్య శాఖామంత్రి, ధర్మవరం ఎమ్మెల్యే సత్యకుమార్ యాదవ్ ప్రత్యేక చొరవతో ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా రూ.1,50,119 విలువైన లెటర్ ఆఫ్ క్రెడిట్ కేవలం 24 గంటల్లోనే మంజూరైంది.సోమవారం మంత్రి వద్ద కుటుంబ సభ్యులు సహాయం కోరగా, వెంటనే సీఎంఆర్ఎఫ్ అధికారులతో సమన్వయం చేసి అవసరమైన ప్రక్రియను వేగవంతం చేయడంతో అనంతపురంలోని కిమ్స్ సవీరా ఆసుపత్రిలో చికిత్సకు అవసరమైన ఆర్థిక సహాయం అందేలా చేశారు.మంత్రి సత్వర స్పందనతో తమకు పెద్ద ఊరట లభించిందని కాటా శ్రీరాములు కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు..

# మహిళల భద్రతకు చర్యలు తీసుకోవాలని వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం నిరసన



అనంతపురం, జూలై 21 అనంత సూర్య:రాష్ట్రంలో మహిళలపై జరుగుతున్న దాడులు, అఘాయిత్యాలు, హత్యలు, అత్యాచారాలను నిరసిస్తూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మహిళా విభాగం ఆధ్వర్యంలో మంగళవారం అనంతపురం జిల్లా పరిషత్ కార్యాలయం వద్ద డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహం ఎదుట నిరసన కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఉమ్మడి అనంతపురం జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ పాల్గొని మాట్లాడుతూ, రాష్ట్రంలో మహిళల భద్రత విషయంలో ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. మహిళలు, బాలికలపై జరుగుతున్న ఘటనలను అరికట్టేందుకు ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని, నిందితులపై చట్టప్రకారం కఠిన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.నిరసన కార్యక్రమంలో నగర పాలక సంస్థ మాజీ మేయర్, మాజీ డిప్యూటీ మేయర్లు, కార్పొరేటర్లు, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు, మహిళా విభాగం నాయకులు, కార్యకర్తలు పాల్గొని మహిళలపై జరుగుతున్న దాడులను ఖండించారు.

# ధర్మవరంలో 15 రోజులపాటు సింగిల్ సోర్స్ ద్వారా విద్యుత్ సరఫరా


ధర్మవరం, జూలై 21 అనంత సూర్య: ధర్మవరం 132/33 కేవీ సబ్‌స్టేషన్‌కు సంబంధించిన అభివృద్ధి పనుల నేపథ్యంలో జూలై 21 నుంచి ఆగస్టు 4 వరకు 15 రోజులపాటు సింగిల్ సోర్స్ ద్వారా విద్యుత్ సరఫరా అందించనున్నట్లు విద్యుత్ శాఖ డీఈఈ లక్ష్మీనరసింహారెడ్డి తెలిపారు.ఈ కారణంగా ధర్మవరం పట్టణంతో పాటు గుత్తికిందపల్లి, గూడ్‌సెట్ కొట్టాల, తారకరామాపురం, చిగిచెర్ల, ఉప్పునేసనపల్లి, గరుడంపల్లి, రామాపురం తదితర ప్రాంతాల్లో అప్పుడప్పుడు విద్యుత్ సరఫరాలో అంతరాయాలు ఏర్పడే అవకాశం ఉందని పేర్కొన్నారు.ప్రజలు తాత్కాలిక అసౌకర్యాన్ని అర్థం చేసుకుని విద్యుత్ శాఖకు సహకరించాలని డీఈఈ లక్ష్మీనరసింహారెడ్డి విజ్ఞప్తి చేశారు



# ఎనుములపల్లి వార్డు సచివాలయాన్ని తనిఖీ చేసిన కలెక్టర్ శ్యామ్ ప్రసాద్

**• ఎస్ఐఆర్ డిజిటలైజేషన్, బీఎల్ఓ యాప్‌లో అనోమలీస్ పరిష్కారంపై ఆరా**

పుట్టపర్తి, జూలై 21 అనంత సూర్య: పుట్టపర్తి పట్టణంలోని ఎనుములపల్లి వార్డు సచివాలయాన్ని జిల్లా కలెక్టర్ ఎ. శ్యామ్ ప్రసాద్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేసి, ప్రత్యేక సమీక్ష (ఎస్ఐఆర్)లో భాగంగా ఎన్యూమరేషన్ ఫారాల డిజిటలైజేషన్ ప్రక్రియను పరిశీలించారు.పోలింగ్ స్టేషన్లు 105, 99, 98లకు చెందిన బీఎల్ఓలతో మాట్లాడిన కలెక్టర్, డిజిటలైజేషన్ పురోగతి, ఎదురవుతున్న సాంకేతిక సమస్యలపై ఆరా తీశారు. బీఎల్ఓ యాప్‌లో నమోదవుతున్న అనోమలీస్‌ను నిబంధనల ప్రకారం త్వరితగతిన పరిష్కరించి, ఓటరు నమోదు ప్రక్రియను పారదర్శకంగా, నిర్దేశిత గడువులో పూర్తి చేయాలని ఆదేశించారు.కార్యక్రమంలో ఆర్‌డీఓ సువర్ణ, మున్సిపల్ కమిషనర్ జి. శ్రీనివాసులు, స్థానిక ఎన్నికల విభాగం సిబ్బంది, వార్డు సచివాలయ ఉద్యోగులు, బీఎల్ఓలు పాల్గొన్నారు.



# పదో తరగతి ప్రతిభావంతుల విద్యార్థులకు సన్మానం



గుత్తి, జూలై 21 అనంత సూర్య: గుత్తి జిల్లా పరిషత్ ఉర్దూ ఉన్నత పాఠశాలలో ఇటీవల నిర్వహించిన పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను గుత్తి ముస్లిం మైనారిటీ వెల్ఫేర్ సొసైటీ సభ్యులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు అభినందనలు తెలియజేసిన సొసైటీ సభ్యులు, భవిష్యత్తులో ఉన్నత లక్ష్యాలతో మరింత కృషి చేసి విద్య, ఉద్యోగ రంగాల్లో రాణించాలని ఆకాంక్షించారు. ప్రతిభను గుర్తించి ప్రోత్సహించడం ద్వారా విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం పెంపొందుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, గుత్తి ముస్లిం మైనారిటీ వెల్ఫేర్ సొసైటీ సభ్యులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు..

# జాతీయస్థాయి క్రీడాకారులను అభినందించిన మంత్రి సత్యకుమార్ యాదవ్



ధర్మవరం, జూలై 21 అనంత సూర్య: జాతీయస్థాయిలో ప్రతిభ కనబరిచిన జూడో, కురాష్, కరాటే క్రీడాకారులను రాష్ట్ర వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ, వైద్య విద్య శాఖ మంత్రి, ధర్మవరం ఎమ్మెల్యే సత్యకుమార్ యాదవ్ మంగళవారం ధర్మవరంలోని ఎన్డీఏ కార్యాలయంలో ఘనంగా అభినందించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, క్రీడల్లో రాణిస్తూ ధర్మవరం, శ్రీ సత్యసాయి జిల్లా, రాష్ట్రానికి మంచి పేరు తీసుకురావడం గర్వకారణమన్నారు. విద్యార్థులు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షిస్తూ, ప్రతిభావంతులైన క్రీడాకారులకు తనవంతు పూర్తి సహాయ సహకారాలు అందిస్తానని హామీ ఇచ్చారు. జి.వి.ఈ.జెడ్.పీ.జీ.హెచ్.ఎస్. బాలికల ఉన్నత పాఠశాలకు చెందిన జూడో, కురాష్, కరాటే క్రీడాకారిణులు వి. సింధు, కె. అర్చన, సి. సాహిత్య, టి.ఎస్. సీమ కౌసర్, ఎస్. అఖిల భాను, ఎస్. దమరేశ్వరి తదితరులను మంత్రి ప్రత్యేకంగా అభినందించారు. అలాగే జాతీయ, రాష్ట్ర సాధయిలో ప్రతిభ కనబరిచిన ఇతర క్రీడాకారిణులకు శుభాకాంక్షలు తెలిపారు. క్రీడాకారులను తీర్చిదిద్దిన జూడో, కరాటే కోచ్ ఎస్. ఇనాయత్ భాషా, పీడీ స్వరూప సేవలను మంత్రి ప్రశంసించారు. క్రీడాకారుల విజయాల్లో తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, కోచ్‌ల పాత్ర ఎంతో కీలకమని పేర్కొంటూ, మరింత మంది విద్యార్థులు క్రీడల్లో రాణించి దేశానికి పతకాలు సాధించాలని ఆకాంక్షించారు.

# 'నెట్ జీరో హెల్త్ క్యాంపస్'ను పక్కా ప్రణాళికతో అమలు చేయాలి




### 49 ప్రభుత్వ సంస్థల్లో 60 రోజుల్లో తొలి దశ పూర్తి చేయాలి: కలెక్టర్ శ్యామ్ ప్రసాద్

పుట్టపర్తి, జూలై 21 అనంత సూర్య: రాష్ట్ర ప్రభుత్వ ప్రతిష్టాత్మక 'నెట్ జీరో హెల్త్ క్యాంపస్' ప్రాజెక్టును జిల్లాలో ఎంపిక చేసిన 49 ప్రభుత్వ సంస్థల్లో పక్కా ప్రణాళికతో విజయవంతంగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ పీజీఆర్ఎస్ హాల్లో వెనుకబడిన తరగతులు, సాంఘిక, గిరిజన సంక్షేమ, కేజీబీవీ విభాగాలకు చెందిన స్పెషల్ ఆఫీసర్లు, జిల్లా సంక్షేమ అధికారులు, ప్రిన్సిపాళ్లు, ప్రధానోపాధ్యాయులకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొన్నారు. ప్రాజెక్టులో తొలి దశగా చేపట్టనున్న మొక్కల నాటే కార్యక్రమాన్ని 60 రోజుల్లో పూర్తి చేయాలని సూచించారు. మిగిలిన అంశాలను కూడా శిక్షణలో పొందిన మార్గదర్శకాల ప్రకారం ప్రణాళికాబద్ధంగా అమలు చేయాలని ఆదేశించారు. విద్యార్థుల ఆరోగ్యం, ముఖ్యంగా బాలికల వ్యక్తిగత పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని, బాలికల పాఠశాలలు, కళాశాలల్లో పారిశుధ్య నిర్వహణ కోసం ఇన్సినరేటర్ల కొనుగోలుకు



వెంటనే అంచనాలు సిద్ధం చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ ప్రాజెక్టు ముఖ్యమంత్రి ప్రతిష్టాత్మక కార్యక్రమమని పేర్కొన్న కలెక్టర్, అధికారులు, ఉపాధ్యాయులు సమన్వయంతో పనిచేసి విద్యార్థులకు ఆరోగ్యకరమైన, హరిత వాతావరణాన్ని కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారులు, వివిధ శాఖల అధికారులు, స్పెషల్ ఆఫీసర్లు, ప్రిన్సిపాళ్లు, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

# వారంలో లోపాలు సరిదిద్దాలి..

- బయో మెడికల్ వేస్ట్ డిస్పోజల్ లో నిబంధనలు ఖచ్చితంగా పాటించాలి
- స్వచ్ఛంధ్ర లక్ష్యాలకు అనుగుణంగా పనిచేయాలని, నిర్లక్ష్యం ఉండరాదు
- ఆం.ప్ర రాష్ట్ర స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఛైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్



అనంతపురం, జులై 21 అనంత సూర్య : జిల్లా సర్వజన ఆస్పత్రిలో బయో మెడికల్ వేస్ట్ డిస్పోజల్, శానిటేషన్ లో నెలకొన్న లోపాలను వారం రోజుల్లోపు సవరించుకోవాలని ఆం.ప్ర రాష్ట్ర



స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఛైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్ ఆదేశించారు. మంగళవారం సాయంత్రం అనంతపురం నగరంలోని జిజిహెచ్ ఆస్పత్రిలో అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్ తో కలిపి రాష్ట్ర స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఛైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో స్వచ్ఛంధ్ర కార్పొరేషన్ డైరెక్టర్లు భవాని రవికుమార్, పర్వీన్ బాను, జిజిహెచ్ సూపరింటెండెంట్ డా.మల్లేశ్వరి, జిజిహెచ్ అడ్మినిస్ట్రేటర్ మల్లికార్జునరెడ్డి, డిపిఓ నాగరాజునాయుడు, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిజిహెచ్ లో బయో మెడికల్ వేస్ట్ డిస్పోజల్ నిర్వహణ, శానిటేషన్ విషయంపై సూపరింటెండెంట్, హెచ్వోడీలు, ఆసుపత్రి సిబ్బంది, ఏజెన్సీలతో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకుని దిశా నిర్దేశం చేస్తూ పలు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఛైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్ మాట్లాడుతూ.. జిజిహెచ్ లో బయో మెడికల్ వేస్ట్ డిస్పోజల్ నిర్వహణలో నెలకొన్న ఆందోళనకర విషయాలు, వాస్తవ పరిస్థితులు తెలుసుకునేందుకు ఇక్కడికి వచ్చామన్నారు. స్వర్ణాంధ్ర, స్వచ్ఛంధ్ర కార్యక్రమంను రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రతినెల మూడవ శనివారం నిర్వహిస్తున్నారని, ఇందులో దేశంలోనే రాష్ట్రాన్ని రోల్ మోడల్ గా తీర్చిదిద్దుతామన్నారు. ప్రజల మూడవ శనివారం స్వచ్ఛాంధ్ర కార్యక్రమాలు జరగాలని, అన్ని శాఖల్లోనూ స్వచ్ఛాంధ్ర కార్యక్రమాలు ఖచ్చితంగా చేయాలన్నారు. ప్రతినెలా ఒక థీమ్ తో ఈ కార్యక్రమాలను నిర్వహించాలన్నారు. అయితే స్వచ్ఛత విషయంలో లోపాలు కనబడుతున్నాయని, సోషల్ మీడియా ద్వారా మా దృష్టికి వచ్చిన లోపాల విషయమై పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ ద్వారా నివేదికను తీసుకోవడం జరిగిందని, బయో మెడికల్ వేస్ట్ సెగ్రిగేషన్ సరిగా జరగడం లేదని, 4 కలర్స్ బిన్స్ ఏర్పాటు చేయడం లేదని, ఇతర ఆర్గానిక్, డ్రైవేస్ట్ కు సరైన స్టోరేజ్ ఫెసిలిటీ లేదని, సర్వవలెన్సు సరిగా లేదని, బయో హజార్డ్ సైనేజస్ లేదని, ఇలా అన్ని రకాల లోపాలకు సంబంధించి ఒక నివేదిక ద్వారా బయటపడిందన్నారు. స్వచ్ఛాంధ్ర లక్ష్యాలకు అనుగుణంగా పనిచేయాలని, లోపాలు ఉండరాదన్నారు. బయో మెడికల్ వేస్ట్ కలెక్షన్, డిస్పోజల్ కు సంబంధించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చిన నిబంధనలను తప్పనిసరిగా అమలు చేయాలన్నారు. డిస్పోజల్ పద్ధతి ప్రకారం సక్రమంగా జరగాలని, శ్రీవెన్ ఎన్విరాన్ టెక్నాలజీస్ ఏజెన్సీ వారు ప్రాపర్ గా కలెక్షన్, డిస్పోజల్ చేయాలని, ఇందులో ఎలాంటి నిర్లక్ష్యం ఉండరాదన్నారు. మీరు బయో మెడికల్ వేస్ట్ కలెక్ట్ చేసేటప్పుడు సెగ్రిగేషన్ పాటిస్తున్నారా, సెగ్రిగేషన్ లేకుండా ఎలా కలెక్ట్ చేస్తున్నారు అని ప్రశ్నించి.. ఏజెన్సీలు సక్రమంగా అప్పజెప్పిన బాధ్యతను నిర్వహించాలని, ఆసుపత్రి సూపరింటెండెంట్, ఏజెన్సీలు కూడా ఇందుకు బాధ్యతగా ఉండాలన్నారు. ప్రతి అంశం కూడా వారం రోజుల్లోపు సరిదిద్దాలని, ఈ వారం రోజుల్లోపు మరోక టీంని కూడా తనిఖీ కోసం పంపిస్తామన్నారు. ఎక్కడ చిన్న అంశంలో కూడా లోపం కనిపించరాదన్నారు. జిజిహెచ్ సూపరింటెండెంట్ మాట్లాడుతూ.. ఏజెన్సీ వారు బయో మెడికల్ వేస్ట్ తరలింపు కోసం చిన్న వాహనం పెట్టారని తెలపగా, ఏజెన్సీ వారు వాహనం మార్చాలని, మొదటి ప్రాధాన్యత జిజిహెచ్ కి ఇవ్వాలని, అన్ని రకాలుగా పరిశుభ్రంగా ఉంచాలని, పెద్ద వాహనం ఏర్పాటు చేయాలని, నిర్ణీత సమయం ఏర్పాటు చేసుకొని అదే సమయానికి రోజు వచ్చి వేస్ట్ తరలింపు చేయాలని, ఖచ్చితంగా టైం షెడ్యూల్ ఉండాలని, నిబంధన ప్రకారం డిస్పోజల్ జరగాలని ఆదేశించారు. జిజిహెచ్ వారు సెగ్రిగేషన్ చేయాలని, కలర్ కోడింగ్ సిస్టం తప్పనిసరిగా పాటించాలని, అన్ సెగ్రిగేటెడ్ వేస్ట్ అప్పగించరాదని, సెగ్రిగేట్ చేసిన వేస్ట్ ఏజెన్సీకి ఇవ్వాలన్నారు. ఆస్పత్రిలో సెగ్రిగేషన్ కోసం సపరేట్ ట్రాలీలు ఏర్పాటు చేయాలని, ఆస్పత్రి గురించి ప్రతికూల వార్తలు రాకుండా పనితీరు ఉండాలన్నారు. జిజిహెచ్ లో శానిటేషన్ ఏజెన్సీ (పద్మావతి హాస్పిటాలిటి ఫెసిలిటీ అండ్ మేనేజ్మెంట్ సర్వీసెస్) వారు చేయాల్సిన బాధ్యతలను సక్రమంగా చేయాలని ఆదేశించారు. ప్రజల ఆరోగ్యం అంటే తమాషాగా ఉందా.. ఎలాంటి తమాషాలు చేయొద్దని.. ఏజెన్సీని బ్లాక్ లిస్టులో పెడతామని, వీల్ చైర్ లలో బయో మెడికల్ వేస్ట్ తరలిస్తారా.. అంటూ ఏజెన్సీ వారిని ప్రశ్నించారు. ఈ విషయమై మంత్రి సత్య కుమార్ యాదవ్ తో మాట్లాడుతామన్నారు. వచ్చే గురువారం రోజు ఏజెన్సీ హెడ్ విజయవాడలోని స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ కార్యాలయంలో తమను వచ్చి కలవాలన్నారు. ఆస్పత్రిలో వార్డు స్థాయిలో వేర్వేరు బిన్స్ పెట్టుకోవాలని, ఫోర్ బిన్ సిస్టం కలర్ కోడింగ్ తో సెన్సిటైజ్ చేయాలని, ఆయా విభాగాల్లో వేస్ట్ పై అవగాహన పెంచాలని ఆదేశించారు. ఈ సమావేశంలో నగరపాలక సంస్థ కమిషనర్ జస్వంత్ రావు, ఆర్ఎంఓ హేమలత, ఆయా విభాగాల హెచ్ఓడీలు, డా.ఆత్మరామ్, డా.భీమసేనచారి, డా.రాజేష్, సుభాష్ చంద్రబోస్, ఏజెన్సీల నిర్వాహకులు అశోక్, హరిప్రసాద్, ఆస్పత్రి డాక్టర్లు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# ధర్మవరంలో బీజేపీకి భారీ చేరికలు






**• మంత్రి సత్యకుమార్ యాదవ్ సమక్షంలో 150 మందికి పైగా పార్టీలో చేరిక**

ధర్మవరం, జూలై 21 అనంత సూర్య: భారతీయ జనతా పార్టీ విజయాలకు కార్యకర్తల క్రమశిక్షణ, సిద్ధాంత నిబద్ధత, సంస్థాగత బలోపేతమే మూలమని రాష్ట్ర మంత్రి, ధర్మవరం ఎమ్మెల్యే సత్యకుమార్ యాదవ్ అన్నారు. మంగళవారం ధర్మవరంలోని ఎన్డీఏ కార్యాలయంలో నిర్వహించిన బీజేపీ అసెంబ్లీ సంస్థాగత సమావేశంలో ఆయన పాల్గొని నాయకులు, కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. ప్రతి కార్యకర్త ప్రజాసేవే లక్ష్యంగా పనిచేయాలని, 'మన్ కీ బాత్' స్ఫూర్తితో సమాజంలో సానుకూల మార్పు తీసుకురావాలని మంత్రి పిలుపునిచ్చారు. బూత్ కమిటీల నుంచి మండల స్థాయి వరకు పార్టీని మరింత బలోపేతం చేయాలని సూచించారు. సమావేశం అనంతరం ధర్మవరం 1వ, 39వ వార్డులకు చెందిన నాయకుల ఆధ్వర్యంలో 150 మందికి పైగా నాయకులు, యువకులు, కార్యకర్తలు బీజేపీలో చేరారు. వారికి మంత్రి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నాయకత్వం, ఎన్డీఏ ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాల పట్ల ఆకర్షితులై ప్రజలు స్వచ్ఛందంగా బీజేపీలో చేరుతున్నారని మంత్రి పేర్కొన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా, రాష్ట్ర నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# గార్లదిన్నెలో ఎంపీఆర్ డ్యామ్ గేట్ల ఆధునికరణ పనుల పరిశీలన
గార్లదిన్నెలో ఎంపీఆర్ డ్యామ్ గేట్ల ఆధునికరణ పనుల పరిశీలన



**• నాణ్యతతో, గడువులోగా పనులు పూర్తి చేయాలి: ఎమ్మెల్యే బండారు శ్రావణి**

అనంతపురం, జూలై 21 అనంత సూర్య: గార్లదిన్నె మండలం పెనకచర్ల (ఎంపీఆర్) డ్యామ్ గేట్ల ఆధునికరణ పనులను శింగనమల ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ మంగళవారం పరిశీలించారు. పనుల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకుని, ఆధునికరణ పనులు నాణ్యత ప్రమాణాలతో పాటు నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు. డ్యామ్ గేట్ల ఆధునికరణ పనుల్లో ఎలాంటి నిర్లక్ష్యం చోటుచేసుకోకుండా పర్యవేక్షణను మరింత బలోపేతం చేయాలని సూచించారు. రైతులకు నీటి సరఫరాలో అంతరాయం కలగకుండా, ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పనులను వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. నీటిపారుదల వ్యవస్థను మరింత బలోపేతం చేసి రైతులకు మెరుగైన సేవలు అందించేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ సూచించారు.

# త్వరలోనే రూ.17.5కోట్లతో ఫ్రెస్ వేస్ట్ మేనేజ్మెంట్ ప్లాంట్






అనంతపురం జూలై 21 అనంత సూర్య :అనంతపురం డంపింగ్ యార్డ్ లో 17.5కోట్ల రూ-పాయలతో ఫ్రెష్ వేస్ట్ మేనేజ్మెంట్ ప్లాంట్ ఏర్పాటు చేయబోతున్నట్టు స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఛైర్మన్ పట్టాభిరామ్, అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ తెలిపారు. మంగళవారం రోజు వారు అధికారులు, టీడీపీ నాయకులతో కలిసి డంపింగ్ యార్డును పరిశీలించారు. చెత్త ప్రాసెసింగ్ ఎలా జరుగుతోందన్నది ఆరాతీశారు. ఇప్పటి వరకు ఎంత మేర చెత్త క్లియర్ చేశారు. వేస్ట్ ఎక్కడ వే-స్తున్నారు.. ఎప్పటి లోగా మొత్తం పూర్తి చేస్తారన్న వివరాలను కాంట్రాక్టర్లతో పాటు అధికారులను అడిగి తెలుసుకున్నారు. పనుల్లో జాప్యం ఛైర్మన్ పట్టాభిరామ్, ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ ఆగ్రహం వ్యక్తం చేశారు. అక్టోబర్ 2లోగా మొత్తం చెత్తను క్లియర్ చేయాలని మరోసారి నిర్లక్ష్యం కనిపిస్తే కాంట్రాక్టులను రద్దు చేయడమే కాకుండా బ్లాక్ లీస్టులో పెడుతామని హెచ్చరించారు. ఈసందర్భంగా పట్టాభిరామ్ మాట్లాడుతూ రాష్ట్రంలో ఎన్నో ఏళ్లుగా ఉన్న పేరుకపోయిన చెత్తను కూటమి ప్రభుత్వం వచ్చాక క్లియర్ చేస్తోందన్నారు. ఇందులో భాగంగా అనంతపురం డంపింగ్ యార్డులో గత ప్రభుత్వం 3.78లక్షల టన్నుల చెత్త పెట్టిపోతే.. ఇప్పటి వరకు 2.41లక్షల టన్నుల చెత్తను తొలగించామన్నారు. పనుల కొంత వరకు ఆలస్యమైన మాట వాస్తవేమనన్నారు. అయితే ఇక నుంచి ప్రతి వారం టార్గెట్లు ఇచ్చి పని చేయిసా-మన్నారు. మూడు నెలల్లోగా మొత్తం చెత్తను క్లియర్ చేస్తామన్నారు. ఇందుకోసం ప్రత్యేక యంత్రాలను కూడా తీసుకొచ్చారన్నారు. ప్రతి రోజు 4వేల టన్నుల చెత్తను క్లియర్ చేసేలా పనులు జరుగుతున్నాయన్నారు. మరోవైపు డంపింగ్ యా-ర్డుకు కొత్తగా వస్తున్న చెత్తను క్లియర్ చేసేందుకు ఫ్రెష్ వేస్ట్ మేనేజ్మెంట్ ప్లాంట్ ను రూ.17.5కోట్లతో ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు. ఇందుకు అవ-సరమైన స్థలాన్ని ఆగష్టు 15 నాటికి సిద్ధం చేసా-మన్నారు. ప్రతి రోజు 170మెట్రిక్ టన్నుల చెత్తను క్లియర్ చేసేలా ప్లాంట్ ఏర్పాటు చేస్తామన్నారు. మ-రోవైపు ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ మాట్లాడుతూ వైసీపీ నాయకులు చెత్తపై పన్నులు వేస్తూ లక్షల టన్నుల చెత్తను పెట్టిపోయారన్నారు. గత ప్రభుత్వంలో 85లక్షల టన్నుల చెత్త ఉంటే ఇప్పటికే 70లక్షల చెత్తను క్లియర్ చేశారన్నారు. గత ప్రభుత్వంలో 3.40లక్షల టన్నుల చెత్తను క్లియర్ చేశామని అప్పటి ఎమ్మెల్యే కోట్ల రూపాయల మేర అవినీతికి పాల్పడ్డారని విమర్శలు చేశారు. వచ్చే అక్టోబర్-2 నాటికి అనంతపురం డింపింగ్ యార్డ్ లోచెత్త లేకుండా చేస్తామన్నారు. ఆగష్టు-15 నాటికి ఫ్రెష్ వేస్ట్ మేనేజ్మెంట్ ప్లాంట్ కు స్థలాన్ని సిద్ధం చేస్తామన్నారు. అక్టోబర్-2 నుంచి ఆ ప్లాంట్ పనులు ప్రారంభించేలా పనులు చూస్తామని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ తెలిపారు.

# డ్రాఫ్ట్ ఓటరు జాబితా ప్రస్తుతం అమల్లో ఉన్న పోలింగ్ బూత్‌ల ఆధారంగానే విడుదల చేయాలి: వైఎస్సార్‌సీపీ



అనంతపురం, జూలై 21 అనంత సూర్య : జిల్లాలో పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ ప్రక్రియ కొనసాగుతున్న నేపథ్యంలో డ్రాఫ్ట్ ఓటరు జాబితాను ప్రస్తుతం అమల్లో ఉన్న పోలింగ్ బూత్‌ల ఆధారంగానే ప్రచురించాలని జిల్లా రెవెన్యూ అధికారి కి వైఎస్సార్‌సీపీ జిల్లా నాయకులు విజ్ఞప్తి చేశారు.కొత్తగా హేతుబద్ధీకరించిన పోలింగ్ కేంద్రాల ఆధారంగా డ్రాఫ్ట్ ఓటరు జాబితా విడుదల చేస్తే ఓటర్లు, బూత్ లెవల్ అధికారులు , బూత్ లెవల్ ఏజెంట్లు , గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలు, ఎన్నికల అధికారులు, ప్రజలకు తీవ్ర గందరగోళం ఏర్పడే అవకాశం ఉందని పేర్కొన్నారు.కొత్త పోలింగ్ బూత్‌ల ప్రకారం జాబితా విడుదలైతే పోలింగ్ కేంద్రాల పరిధులపై అయోమయం నెలకొనడంతో పాటు ఓటర్ల ధృవీకరణ, అభ్యంతరాలు--దరఖాస్తుల స్వీకరణ, ప్రజల్లో అవగాహన కార్యక్రమాలు, క్షేత్రస్థాయి ఎన్నికల నిర్వహణలో ఇబ్బందులు తలెత్తే అవకాశముందని వివరించారు.అందువల్ల ప్రస్తుతం అమల్లో ఉన్న పోలింగ్ బూత్‌ల ఆధారంగానే డ్రాఫ్ట్ ఓటరు జాబితాను ప్రచురించి, హేతుబద్ధీకరణ ద్వారా వచ్చిన మార్పులను తుది ఓటరు జాబితా ప్రచురణ సమ-యంలో మాత్రమే అమలు చేయాలని డీఆర్వోను కోరారు. ఈ విధానం వల్ల ఓటరు జాబితాల పరిశీలన సులభతరం కావడంతో పాటు ప్రజలకు ఇబ్బందులు తగ్గి, ఎన్నికల ప్రక్రియ మరింత పారదర్శకంగా, నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు దోహదపడుతుందని తెలిపారు.ఈ మేరకు ప్రజాస్వామ్య విలువలను పరిరక్షించే దిశగా తమ విజ్ఞప్తిని సానుకూలంగా పరిగణించి తగిన ఆదేశాలు జారీ చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో బూత్ కమిటీ జిల్లా అధ్యక్షుడు ఎద్దుల అమర్‌నాథ్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి రమేష్ గౌడ్, మాజీ మేయర్ మహమ్మద్ వసీం, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి వెన్నం శివారెడ్డి, నగర పార్టీ అధ్యక్షుడు చింత సోమశేఖర్ రెడ్డి, మైనార్టీ జిల్లా అధ్యక్షుడు సైపుల్లా బేగ్, నగర ఉపాధ్యక్షుడు పీవీ రమణారెడ్డి, క్రిస్టియన్ మైనార్టీ నాయకులు జానీ, హేమ కిరణ్, ఘన, తేజ తదితరులు పాల్గొన్నారు.

# ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తున్నాం.. ప్రజలు దాన్ని గుర్తించాలి





అనంతపురం, జూలై 21 అనంత సూర్య : ఎన్నికల ముందు ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తున్నామని.. గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను చూసి వచ్చే స్థానిక సంస్థల్లో ప్రజలు ఓట్లు వేయాలని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత విజ్ఞప్తి చేశారు. చెన్నేకొత్తపల్లి మండలం ప్యాదిండి పంచాయితీ నామాల గ్రామంలో రూ.50లక్షలతో నిర్మించిన సీసీ రోడ్లను ఆమె ప్రారంభించారు. ముందుగా గ్రామానికి వచ్చిన ఎమ్మెల్యే సునీతకు గ్రామస్థులు, టీడీపీ నాయకులు భారీ స్వాగతం పలికారు. అనంతరం గ్రామంలో ప్రదర్శనగా వెళ్లి నూతన రోడ్లను ప్రారంభించారు. మార్గమధ్యలో గ్రామస్థులు పూలవర్షం కురిపిస్తూ అభిమానం చాటుకున్నారు. గ్రామస్థులు ఎమ్మెల్యే సునీతకు కొన్ని విజ్ఞప్తులు చేశారు. అంగన్వాడీ పా-ఠశాలకు ఒక నూతన భవనం, గొల్లవాండ్లపల్లి గ్రామంలో రోడ్డు, ప్యాదిండిలో సచివాలయం కావాలని కోరారు. వీటిపై ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆమె అధికారులను ఆదేశించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే సునీత మాట్లాడుతూ రాప్తాడు నియోజకవర్గంలో సుమారు 100కోట్ల ఎన్ఆర్ఈజీఎస్, ఎంపీ నిధులు, జిల్లా పరిషత్ నిధులతో సిసి, బిటి రోడ్లు వేశామన్నారు. చెన్నేకొత్తపల్లి మండలంలో సుమారు 25 కోట్లతో రోడ్లు వేసినట్టు తెలిపారు. ప్యాదిండి పంచాయితీలో 1.50 కోట్లతో రోడ్లు వేశామన్నారు. నామాల గ్రామంలో 75 లక్షలతో సిసి రోడ్లు వేయడంతో పాటు గ్రామంలో అన్ని సౌకర్యాలు కల్పించామన్నారు. ఇంకా కొన్ని గ్రామాల్లో రోడ్లు, బ్రిడ్జిలు, సచివాలయాలు ఇతర వాటిని అడిగారని.. త్వరలోనే వాటిని కూడా నిర్మిస్తామని హామీ ఇచ్చారు. ప్రాధాన్యత వారీగా అన్ని గ్రామాల్లో అభివృద్ధి కార్యక్రమాలు చేస్తున్నట్లు వివరించారు. గత ప్రభుత్వంలో జరిగిన ఆర్థిక విధ్వంసం కారణంగా అన్ని పనులు ఒకేసారి చేయలేకపోతున్నామని.. ముఖ్యమంత్రి చంద్రబాబు ఎంతో అనుభవంతో వాటన్నింటిని చక్కదిద్దుతూ అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నారన్నారు. మంత్రి నారా లోకేష్ ఇచ్చిన హామీ మేరకు బుధవారం రోజు తల్లికి వందనం కింద ప్రతి విద్యార్థికి 15వేల రూపాయలు ఆర్థిక సాయం అందజేస్తున్నట్లు తెలిపారు. గతంలో అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలకు పిల్లలకు తల్లికి వందనం అందేది కాదన్నారు. తక్కువ వేతనాలు ఉన్నవారికి ఇలాంటి పథకం అందకపోతే నష్టపోతారన్న ఉద్దేశంతో తాను కూడా అసెంబ్లీలో దీని గురించి మాట్లాడానన్నారు. ఈ ఏడాది నుంచి అంగన్వాడీ సిబ్బందికి కూడా తల్లికి వందనం అందుతుందన్నారు. ఈ ప్రభుత్వం చేస్తున్న మంచిని ప్రతి ఒక్కరు గుర్తించాలని విజ్ఞప్తి చేశారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో గ్రామస్తులంతా ఐక్యంగా ఉండి ఒక మంచి వ్యక్తిని ఎన్నుకోవాలని సూచించారు. రెండేళ్లలో ప్రభుత్వం చేసిన అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను, గత ఐదేళ్లలో జరిగిన వాటిని ప్రజలే గమనించాలని ఎమ్మెల్యే సునీత సూచించారు.

# విద్యుత్ షార్ట్ సర్క్యూట్ తో ఇల్లు దగ్ధం

## 40, వేల నగదు తో సహా ఇంటి సామాగ్రి బూడిద

ముదిగుబ్బ,జులై 21, అనంత సూర్య: ముదిగుబ్బ మండలంలోని



కొడవండ్లపల్లి పరిధిలో ఉన్న చిత్ర వాండ్ల పల్లి గ్రామంలో మంగళవారం విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా ఇల్లు పూర్తిగా దగ్ధమైంది గ్రామానికి చెందిన పూజారి రాజు వయసు (35) రామకృష్ణ కుమారుడు తన కుటుంబముతో కలిసి నివసిస్తున్న ఇంటిలో-10-30- గంటల సమయంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ ఏర్పడి ఒక్కసారిగా మంటలు చెలరేగి మంటలు వేగంగా వ్యాపించడంతో ఇంటిలో ఉన్న బట్టలు బియ్యం ఐదు మూటలు సామాగ్రి ఇతర గృహప్రకారణలు కాలిపోయాయి బాధిత కుటుంబ సభ్యులు తెలిపారు ప్రమాదంలో ఎటువంటి ప్రాణం నష్టం జరగకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు ఈ ఘటనలో బాధ్యత కుటుంబం తీవ్రంగా నష్టపోయింది విషయం తెలుసుకున్న సంబంధిత అధికారులు వివరాలు తెలుసుకొని జరిగిన నష్టంపై సమాచారం సేకరించినట్లు తెలిసింది ప్రభుత్వం స్పందించి మమ్మల్ని ఆదుకోవాలని బాధితులు కోరుతున్నారు.

# నగరంలో పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలి

- స్వచ్ఛంధ్ర కార్పొరేషన్ చైర్మన్ పట్టాభిరామ్, ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్

- నగరపాలక సంస్థలో మున్సిపల్, పబ్లిక్ హెల్త్, శానిటేషన్ అధికారులతో సమావేశం



అనంతపురం, జూలై 21 అనంత సూర్య : అనంతపురం నగరంలో పారిశుద్ధ్య నిర్వహణను మరింత సమర్ధవంతంగా చేపట్టి ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని అనంతపురం ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ సూచించారు. అనంతపురం నగరపాలక సంస్థ కార్యాలయంలో మంగళవారం జరిగిన కౌన్సిల్ సమావేశంలో స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ పట్టాభిరామ్ తో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మున్సిపల్, పబ్లిక్ హెల్త్, శానిటేషన్ అధికారులతో పారిశుద్ధ్య నిర్వహణ, ఘన వ్యర్థాల సేకరణ, డ్రైనేజీల నిర్వహణ, ప్రజారోగ్య పరిరక్షణ తదితర అంశాలపై సమీక్ష నిర్వహించారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని పారిశుద్ధ్య పనులను వేగవంతం చేయాలని, డ్రైనేజీలను ఎప్పటికప్పుడు శుభ్రం చేసి నీటి నిల్వలు లేకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని ప్రజల భాగస్వామ్యంతో విజయవంతం చేసి, అనంతపురాన్ని పరిశుభ్రమైన నగరంగా తీర్చిదిద్దేందుకు సమన్వయంతో పనిచేయాలని పట్టాభిరామ్, ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ అధికారులకు సూచించారు.

# వైసీపీ అధినేత జగన్‌ను కలిసిన కాగజ్ ఘర్ రిజ్వాన్



అనంతపురం, జూలై 21 అనంత సూర్య : తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్ మోహన్ రెడ్డి ని మంగళవారం జిల్లా మాజీ వక్ఫ్ బోర్డు చైర్మన్ కాగజ్ ఘర్ రిజ్వాన్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో ప్రస్తుతం కూటమి ప్రభుత్వ పాలనలో మైనారిటీల పరిస్థితిపై జగన్ మోహన్ రెడ్డికి రిజ్వాన్ వివరించారు. రాష్ట్ర వ్యాప్తంగా మైనారిటీలపై జరుగుతున్న దాడులు, అరాచకాల గురించి ఆయన అధినేత దృష్టికి తీసుకెళ్లారు. అంతేకాకుండా, సంక్షేమ పథకాల అమలులో కూటమి ప్రభుత్వం మైనారిటీలను ఏ విధంగా వంచిస్తోందో, పథకాలు అందకుండా ఎలా మోసం చేస్తోందో వివరించారు. వైఎస్సార్‌సీపీ హయాంలో మైనారిటీలకు అందిన సంక్షేమం, భద్రతలను గుర్తుచేస్తూ.. ప్రస్తుత ప్రభుత్వ వైఫల్యాలపై పార్టీ పరంగా పోరాడాలని చర్చించారు. కార్యక్రమంలో కాగజ్ ఘర్ రిజ్వాన్‌తో పాటు రాష్ట్ర హజ్ కమిటీ మాజీ చైర్మన్ గౌసుల్ ఆజమ్, నెల్లూరు జిల్లా మాజీ వక్ఫ్ బోర్డు చైర్మన్ మీరా బాషా, రాష్ట్ర మాజీ మైనారిటీ కార్పొరేషన్ డైరెక్టర్ నిజాం, గుడివాడ మైనారిటీ నాయకులు సయ్యద్, పలువురు ముస్లిం మైనారిటీ నాయకులు వై.ఎస్. జగన్ మోహన్ రెడ్డి ని కలిసిన వారిలో ఉన్నారు.

# సీడ్ బాల్స్‌తో అటవీ సంపదకు ఊపిరి

కొత్తచెరువు, జర్నీలై 21, అనంత సూర్య: అడవులలో సీడ్ బాల్స్ (విత్తన బంతులు) చల్లడం ద్వారా వృక్ష సంపద గణనీయంగా పెరుగుతుందని, ఇది అటవీ ప్రాంతాల్లో నివసించే జంతువులు, పక్షులకు ఎంతో ప్రయోజనకరంగా నిలుస్తుందని బుక్కపట్నం రేంజ్ అటవీ శాఖ సిబ్బంది పేర్కొన్నారు. రాష్ట్రంలో అటవీ పచ్చదనాన్ని 50 శాతానికి పెంచాలనే లక్ష్యంతో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, అటవీ శాఖ మంత్రి పవన్ కళ్యాణ్ సీడ్ బాల్స్ కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా చేపట్టాలని ఆదేశాలు జారీ చేశారు. శ్రీ సత్యసాయి జిల్లా అటవీ శాఖాధికారి చక్రపాణి సూచనల మే-రకు అటవీ శాఖ సిబ్బంది మంగళవారం పుట్టపర్తి మండల పరిధిలోని గంగిరెడ్డిపల్లి, కొండకమర్ల అటవీ ప్రాంతాల్లో విత్తన బంతుల తయారీ, వాటిని చల్లే కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా అటవీ పరిరక్షణకు, జంతువులకు ఉపయోగపడే: రావి, మర్రి, జువ్వి, తుమ్మ, నారేపి వంటి వివిధ రకాల వృక్ష జాతుల విత్తనాలతో తయారు చేసిన సీడ్ బాల్స్‌ను అటవీ ప్రాంతాల్లో విస్తృతంగా చల్లారు.ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ సీడ్ బాల్స్ ద్వారా విత్తనాలు చల్లడం వల్ల అడవుల్లో సహజ సిద్ధంగా వివిధ రకాల మొక్కలు మొలకెత్తే అవకాశం పెరుగుతుంది.ఇది అడవుల విస్తీర్ణాన్ని పెంచడమే కాకుండా, అడవి జంతువులకు సహజ ఆవాసాలను ఏర్పరుస్తుంది.వీటి ద్వారా జంతువులు, పక్షులకు అవసరమైన ఆహారం కూడా లభిస్తుంది అని వెల్లడించారు.ఈ కార్యక్రమంలో పుట్టపర్తి ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ చంద్రనాయక్, సీబీఓలు రామకృష్ణ, గిరీష్‌తో పాటు గంగిరెడ్డిపల్లి గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేశారు.

Editor, Published and Owned by C Hari Krishna, Published from D.no 1-3-780, Rajaka Nagar, Anantapur - 515001, Printed from NALIVELI EXPRESS PRINTERS Hno. 1-1A9T-10, Main Road, Pattikonda, Kurnool 518380, EDITOR : C HARI KRISHNA" Mobile number: 9182495405